# గుడిసె వాసులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బి ఆర్ ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు

**- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.**






**ఇల్లందు న్యూస్ :-**గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్,కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసిన కోరం కనకయ్య, భానోత్ హరిప్రియలు దేవులపల్లి యాకయ్య నగర్ ప్రజల దగ్గరికి వచ్చి పట్టాలిస్తామని, ఇండ్లు కట్టిస్తామని రహదారి సౌకర్యం కల్పిస్తామని, మంచినీటి సౌకర్యం తొ పాటు అనేక హామీలు గుప్పించి చేతులు ఎత్తేసారని సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు గత 8 ఏళ్లుగా రాజీవ్ నగర్ తండాలోని దేవులపల్లి యాకయ్య నగర్ లో 618 సర్వేలో 120 మంది గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని, వారి అభ్యర్థన మేరకు శనివారం మండలంలోని సీఎస్పీ గ్రామపంచాయతీ పరిధిలోని దేవులపల్లి యాకయ్యనగర్ లో తనతో పాటు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే. రమేష్, జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబీ, మండల పార్టీ కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ ల కలిసి సందర్శించడం జరిగిందన్నారు. దేవులపల్లి యాకయ్య నగర్ లో దుర్భర పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. గుడిసె వాసుల ఇబ్బందులను పరిశీలించగా కురిసిన భారి వర్షాలకు గుడిసె పైకప్పులు కూలిపోవడం గాలికి ఎగిరిపోవడం కొన్ని పూర్తిగా నేలమట్టం కావడం కాలనీ ఎంత బురదమయం అడుగు తీసి అడుగు వేయలేని స్థితి నెలకొందని డ్రైనేజీలు లేక మురుగునీరు కచ్చా దారిలోనే పారడం,ముఖ్యంగా తాగునీరు సౌకర్యం లేకపోవడం లాంటి దారుణమైన జీవన పరిస్థితులను చూసి తాను చలించిపోయామన్నారు.

ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ళు కావాలని గత ఎనిమిదేళ్ళుగా గుడిసే వాసులు చేస్తున్న పోరాటం అమోఘమని, అందరూ కలిసికట్టుగా ఉద్యమిస్తే ప్రభుత్వం దిగి వస్తుందని సమస్య పరిష్కారానికి నోచుకుంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె. రమేష్లు అన్నారు. కొందరు గుడిసె వాసులు జిల్లా నాయకులను వారి గుడిసెలలోకి తీసుకెళ్ళి తమ గోడు ను వెళ్ళబోసుకున్నారని తెలిపారు.దీంతో గుడిసె వాసులతొ సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి అన్ని విధాల తమ పార్టీ తాము అండగా ఉంటామని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. యాకయ్య నగర్ సమస్యలను కనీస వసతుల సౌకర్యం కోసం అనేకసార్లు మండల జిల్లా అధికారులకు కాంగ్రెస్ పార్టీ మంత్రులకు అనేక సార్లు వినతి పత్రాలు విజ్ఞప్తి చేసినా పండించుకోవడం లేదన్నారు. అయినప్పటికీ ఈ సమస్యల ను సాధించేంతవరకు పోరాటం నిరంతరం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సభ్యులు నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, నాయకులు మన్యం మోహన్ రావు,సుల్తానా, ఖాదర్, ఆలేటి సంధ్య, మాదారపు వెంకటేశ్వర్లు, సర్వన్ కుమార్, కొడెం బోస్,మరియ,సుజాత,వెంకన్న,వీరభద్రం, కమల,హసీనా,కోటమ్మ,రాజునీల రాణి, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ద్వితీయ శ్రేణి జడ్జిని సన్మానించిన సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్



**ఇల్లందు న్యూస్:-** ఖమ్మం ద్వితీయ శ్రేణి ఎక్సైజ్ మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరించిన క్షత్రి (ఠాకూర్) విజయ ఇల్లందులో సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా దంతాల ఆనంద్ ఆమెకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సంద ర్భంగా దంతాల ఆనంద్ మాట్లాడుతూ విజయ గతంలో తన వద్ద జూనియర్ న్యాయ వాదిగా పనిచేసి, నేడు ద్వితీయ శ్రేణి మేజి స్ట్రేట్‌గా నియమితులవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆమె విజయం ఇల్లందు బార్ అసోసియేషన్‌కే గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని న్యాయవాది ఆనంద్ ఆకాంక్షించారు.లా విద్యాభ్యాసంలో మూడు గోల్డ్ మెడల్స్ సాధించి ప్రతిభ చాటిన విజయలక్ష్మి తన కళాశాలకు కూడా గర్వకారణమయ్యారని పేర్కొన్నారు. అలాగే ఆమె తల్లి ఠాకూర్ ఇందిరా కూడా గతంలో ఇల్లందులో ద్వితీయ శ్రేణి మేజిస్ట్రేట్‌గా సేవలందించడం విశేషమన్నారు.విజయ నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఇల్లందు సెంట్రల్ లైబ్రరీ ని తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి



**ఇల్లందు న్యూస్:-**జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కరుణకుమారి శనివారం ఇల్లందు జే కే కాలనీ లోని సెంట్రల్ శాఖా లైబ్రరీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డులను ఫైళ్లను తనిఖీ చేసిన అనంతరం గ్రంథాలయ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో రీడర్స్ ను పలకరిస్తూ ఈ గ్రంథాలయంలో ఏమైనా ఇబ్బం దులు, అసౌకార్యాలు ఉంటే లైబ్రరీ రుక్మిణికి తెలియజేయాలని ఆమె మాకు తెలియజేస్తుందని కరుణకుమారి పేర్కొన్నారు. ఇప్పటికే మంచి నీటి సౌకర్యము, వైఫై, సౌకర్యాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. యూపీ పి ఎస్ సి, గ్రూప్ వన్, గ్రూప్ టు తదితర పోటీ పరీక్షలకు ఇలాంటి మంచి వాతావరణంలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాలని తద్వారా ఇల్లందు లైబ్రరీకి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రరియన్ డి. రుక్మిణి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలి సీతామహాలక్ష్మి




**ఇల్లందు న్యూస్:-**అంగన్వాడి కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలనిఇల్లందు ప్రాజెక్ట్ సమావేశంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీతా మహాలక్ష్మి పిలుపునిచ్చారు.

ఇల్లందు మండల ప్రాజెక్ట్ అంగన్వాడీ కార్యకర్తల సమావేశం గురువమ్మ అద్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఇచ్చిన ?18,000 వేతనం హామీని అమలు చేయించే వరకు పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయాలని ఆమె అన్నారు.

ఈ సందర్భంగా ఆమె ప్రధానంగా ఈ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.అంగన్వాడీ టీచర్లకు 18,000 వేతనం వెంటనే అమలు చేయాలని,ప్రమోషన్‌కు అర్హులైన ఆయాలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని,అంగన్వాడీ సిబ్బందిపై మోపుతున్న అదనపు పనిభారాన్ని తొలగించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి ఎల్ ఓ / సర్ ఎన్నికల విధుల్లో 50 సంవత్సరాలు దాటిన అంగన్వాడీ టీచర్లను, ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని, ఆయాలు లేని కేంద్రాల టీచర్లను విధుల నుంచి మినహాయించాలని కోరారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన సేవలకు ఆటంకం కలగకుండా అంగన్వాడీ కేంద్రాల సాధారణ కార్యకలాపాలను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,


అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని, ప్రతి కార్యకర్త ఐక్యంగా పోరాటాల్లో పాల్గొనాలని సీతా మహాలక్ష్మి అంగన్వాడి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో ఎఐటియుసి గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, నర్సీబాయి, సక్కుబాయి, శాంత, అంజమ్మ, వసంత, సరస్వతి, విజయ, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.


# 40 ఏళ్ల తరువాత మహిళలు ఈ జాగ్రత్తలు పాటిస్తే.. ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు..

40 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత మహిళల శరీరంలో అనేక శారీరక, హార్మోన్ల, మానసిక మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే కుటుంబ బాధ్యతలు, ఉద్యోగం, సంరక్షణ పనుల్లో నిమగ్నమై ఉండే చాలా మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఫలితంగా అలసట, నిద్రలేమి, మూడ్ మార్పులు, బరువు పెరగడం వంటి లక్షణాలను వయస్సు ప్రభావంగానే భావించి వైద్య సలహా తీసుకోవడం ఆలస్యం చేస్తారు. అయితే ఈ దశలో అవగాహన పెంచుకోవడం, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మధ్య వయస్సులో మహిళల్లో సాధారణంగా పెరిమెనోపాజ్, మెనోపాజ్ దశలు ప్రారంభమవుతాయి. ఈ సమయంలో హార్మోన్లలో వచ్చే మార్పులు శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. నెలసరి క్రమం తప్పడం, నిద్ర సరిగా లేకపోవడం, మానసిక స్థితిలో హెచ్చుతగ్గులు, కారణం లేకుండా బరువు పెరగడం, శక్తి తగ్గిపోవడం, జీవక్రియ మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.ఎముకల సాంద్రత తగ్గుతుంది..ఈ వయస్సు నుంచి ఎముకల సాంద్రత క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. దీంతో బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపోరోసిస్) ప్రమాదం పెరుగుతుంది. అదే సమయంలో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు కూడా అధికమవుతాయి. అయినప్పటికీ చాలామంది మహిళలు ఇవన్నీ వయస్సుతో వచ్చే సహజ మార్పులేనని భావించి వైద్యులను సంప్రదించరు. అయితే లక్షణాలు ఎక్కువకాలం కొనసాగినా లేదా తీవ్రంగా ఉన్నా వాటిని నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 40 ఏళ్ల తర్వాత మహిళల ఆరోగ్యంపై సరైన అవగాహన లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా మెనోపాజ్, హార్మోన్ల మార్పులు, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై ఇప్పటికీ బహిరంగ చర్చలు తక్కువగా జరుగుతున్నాయి. దీంతో చాలామంది మహిళలు అసౌకర్యాలను సహజమని భావించి చికిత్స ఆలస్యం చేస్తున్నారు. ఆందోళన, చిరాకు, నిద్రలో అంతరాయం, ఏకాగ్రత తగ్గడం, భావోద్వేగ అలసట, ఎప్పుడూ నీరసంగా అనిపించడం వంటి లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. హార్మోన్ల మార్పులు మానసిక స్థితి, నిద్ర, శక్తి స్థాయిలు, ఏకాగ్రతపై ప్రభావం చూపుతాయి. అందువల్ల సమస్యలు తీవ్రమయ్యే వరకు వేచి ఉండకుండా ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం అవసరం.రెగ్యులర్‌గా పరీక్షలు చేయించాలి..40 ఏళ్ల తర్వాత ఆరోగ్య సంరక్షణ అంటే కేవలం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం మాత్రమే కాకుండా, వ్యాధులు రాకముందే నివారించడంపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది మధుమేహం, గుండె జబ్బులు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. అలాగే ఎముకల సాంద్రత పరీక్షలు, జీవక్రియ పరీక్షలు, రొమ్ము ఆరోగ్య పరీక్షలు కూడా క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచిస్తున్నారు. హార్మోన్ల ఆరోగ్యం, లైంగిక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై కూడా వైద్యులను సంప్రదించడం అవసరం. మహిళల్లో గుండె సంబంధిత వ్యాధులు ప్రధాన ఆరోగ్య ప్రమాదాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, వాటి హెచ్చరిక సంకేతాలను చాలాసార్లు గుర్తించలేకపోతున్నారు. ముందస్తు పరీక్షలు, ప్రమాద స్థాయిని అంచనా వేయడం ద్వారా భవిష్యత్తులో వచ్చే తీవ్రమైన సమస్యలను తగ్గించుకోవచ్చు.ఆరోగ్యకరమైన జీవనశైలి ముఖ్యం..



ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా ఈ దశలో కీలక పాత్ర పోషిస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ముఖ్యంగా శక్తి పెంచే వ్యాయామాలు (స్ట్రెంగ్త్ ట్రైనింగ్) చేయడం, తగినంత ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కండరాల బలం, ఎముకల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మంచి నిద్ర, ఒత్తిడి నియంత్రణ, సమతుల్య ఆహారం కూడా అంతే ముఖ్యం. దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి హార్మోన్ల సమస్యలను మరింత తీవ్రం చేస్తాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మంచి అనుబంధాలు కొనసాగించడం మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆరోగ్యాన్ని పర్యవేక్షించే సాంకేతిక పరికరాలు, హెల్త్ ట్రాకింగ్ యాప్‌లను ఉపయోగించడం ద్వారా శరీరంలో వచ్చే మార్పులను గమనించి అవసరమైన సమయంలో వైద్య సలహా తీసుకోవచ్చు. 40 ఏళ్ల తర్వాత మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్య సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడడం ద్వారా దీర్ఘకాలం ఆరోగ్యంగా, స్వతంత్రంగా జీవించే అవకాశాలు మెరుగుపడతాయి.

# ప్రపంచవ్యాప్తంగా భారీగా పెరుగుతున్న హీట్ స్ట్రెస్ బాధితుల సంఖ్య.. అసలేంటిది.. ఏం జరుగుతుంది..?



వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకరమైన ఉష్ణ ఒత్తిడి (హీట్ స్ట్రెస్)కు గురయ్యే ప్రజల సంఖ్య గత 50 ఏళ్లలో గణనీయంగా పెరిగినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ఐరోపా తీవ్ర వేడి తరంగాలతో అల్లాడుతున్న సమయంలో విడుదలైన ఈ పరిశోధన, అధిక ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావాన్ని మరోసారి స్పష్టం చేసింది. నేచర్ క్లైమేట్ చేంజ్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం 1970ల నుంచి 2024 వరకు ప్రపంచవ్యాప్తంగా హీట్ స్ట్రెస్ పరిస్థితులను విశ్లేషించింది. అన్ని ఖండాల్లోనూ తీవ్ర, అత్యంత తీవ్ర ఉష్ణ ఒత్తిడి ఘటనలు గతంతో పోలిస్తే ఎక్కువగా నమోదవుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. హీట్ స్ట్రెస్ అంటే కేవలం గాలి ఉష్ణోగ్రత మాత్రమే కాదు. తేమ, గాలి వేగం, సూర్యరశ్మి తీవ్రత, మానవ శరీరం వేడికి ఎలా స్పందిస్తుందనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని శరీరం అనుభవించే ఉష్ణోగ్రతను అంచనా వేస్తారు. దీనినే ఫీల్స్-లైక్ టెంపరేచర్ గా పేర్కొంటారు.22 శాతానికి చేరిన సంఖ్య..1970లలో ప్రపంచ జనాభాలో సుమారు 16 శాతం మంది కనీసం ఒకరోజైనా 46 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువ ఫీల్స్-లైక్ ఉష్ణోగ్రతను అనుభవించేవారు. ప్రస్తుతం ఈ సంఖ్య 22 శాతానికి పెరిగింది. అంటే గతంతో పోలిస్తే అదనంగా సుమారు 100 కోట్ల మంది తీవ్ర హీట్ స్ట్రెస్‌కు గురవుతున్నారని అధ్యయనం పేర్కొంది. పరిశోధకులు యూనివర్సల్ థర్మల్ క్లైమేట్ ఇండెక్స్ (యూటీసీఐ) ఆధారంగా ఈ విశ్లేషణ నిర్వహించారు. ఇందులో గాలి ఉష్ణోగ్రతతోపాటు తేమ, గాలి వేగం, సౌర వికిరణం, మానవ శరీర ప్రతిస్పందన వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ కారణంగా హీట్ స్ట్రెస్ ఘటనలు మరింత తరచూ, తీవ్రంగా, ఎక్కువసేపు కొనసాగుతున్నాయని అధ్యయనం వెల్లడించింది.గతంతో పోలిస్తే అధికం..స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్ వంటి దేశాల్లో ప్రస్తుతం ప్రజలు అనుభవిస్తున్న ఫీల్స్-లైక్ ఉష్ణోగ్రతలు 1970లతో పోలిస్తే ఐదు డిగ్రీల సెల్సియస్ వరకు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఫ్రాన్స్‌లో సంభవించిన రెండో తీవ్రమైన వేడి తరంగం సమయంలో ఇద్దరు చిన్నారులు మరణించిన ఘటన పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. గతంలో ఇలాంటి ఉష్ణ ఒత్తిడి కనిపించని ప్రాంతాల్లో కూడా ఇప్పుడు హీట్ స్ట్రెస్ విస్తరిస్తోందని పరిశోధకులు తెలిపారు. ఉత్తర అమెరికాలోని కొన్ని ప్రాంతాలు, యునైటెడ్ కింగ్‌డమ్, స్కాండినేవియా దేశాల్లో కూడా కనీసం 38 డిగ్రీల సెల్సియస్ ఫీల్స్-లైక్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి వేళల్లో కూడా వేడి తగ్గకపోవడం మరో ఆందోళనకర అంశంగా అధ్యయనం పేర్కొంది. శరీరానికి చల్లబడేందుకు అవకాశం లేకపోవడం వల్ల ఆరోగ్య ప్రమాదాలు మరింత పెరుగుతాయి. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు హెచ్చరించారు.రాత్రి పూట కూడా ఎక్కువే..ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో ట్రాపికల్ నైట్స్ సంఖ్య కూడా పెరుగుతోందని అధ్యయనం వెల్లడించింది.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, 5 NO 22-6-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL-MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8886881338, +91 81215 50907 EMAIL : shivakumarlsl@gmail.com